బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి

నస్రుల్లాబాద్, జూన్ 30: మండలంలోని కంశెట్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి(40) బాన్సువాడ వైపునకు బైకుపై వెళ్తుండగా.. కంశెట్‌పల్లి శివారులో అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లాస్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నేడు 'రైతుభరోసా'పై సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 30: మండలంలోని మీసానిపల్లి, ఆజామాబాద్ రైతువేదికల్లో జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు సోమవారం రైతుభరోసా పథకంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సొసైటీల సీఈవోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసానిపల్లి రైతువేదికలో సోమవారం ఉదయం 10గంటలకు, ఆజామాబాద్ రైతువేదికలో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. సమావేశంలో రైతు భరోసాపై అవగాహన కల్పించడంతోపాటు రైతుల అభిప్రాయాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

నాగిరెడ్డిపేట మండలంలో..

నాగిరెడ్డిపేట, జూన్ 30: నాగిరెడ్డిపేటలోని మాల్తుమ్మెద, తాండూర్ సొసైటీల ఆధ్వర్యంలో రైతుభరోసా పథకంపై సోమవారం అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు సొసైటీల అధ్యక్షులు గంగారెడ్డి, నర్సింహులు ఆదివారం తెలిపారు. రైతుల అభిప్రాయాలను సేకరించి ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

ప్రపంచ కప్ గెలుపు సంబురాలు

గాంధారిలో నిర్వహించిన సంబురాల్లో పాల్గొన్న యువకులు

గాంధారి, జూన్ 30: టీ-20 ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ ఆఫ్రికాను ఓడించి భారతదేశం ప్రపంచ కప్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. శనివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో ఇండియా కప్ గెలువడంతో క్రికెట్ అభిమానుల సంబురాలు మిన్నంటాయి. గాంధారిలో పలువురు యువకులు వీధుల్లోకి వచ్చి పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. 13ఏండ్ల అనంతరం ఇండియా ప్రపంచ కప్ గెలుచుకోవడం ఆనందంగా ఉన్నదని తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

బోర్లం క్యాంపు గ్రామంలో చేపడుతున్న సీసీ డ్రైనేజీ పనులు

బాన్సువాడ రూరల్, జూన్ 30: మండలంలోని బోర్లం క్యాంపు గ్రామ దుర్గమ్మ కాలనీలో సీసీ డ్రైన్ నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. దుర్గమ్మ కాలనీలో 50 డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి, సీసీ రోడ్లు వేశారు. వానకాలం కావడంతో డ్రైనేజీ వ్యవస్థ లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం డ్రైనేజీలు నిర్మించడంతో ఇబ్బంది తొలిగిపోతుందని కాలనీవాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఘనంగా నల్ల పోచమ్మ పండుగ

పండుగలో పాల్గొన్న ఆటో యూనియన్ బాధ్యులు

నాగిరెడ్డిపేట, జూన్ 30: మండలంలోని గోపాల్‌పేట, మెదక్ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్వర్యంలో ఆదివారం స్థానిక నల్లపోచమ్మ ఆలయం వద్ద పండుగను ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ నుంచి ఆటోలతో ర్యాలీగా ఆలయానికి చేరుకొని, అమ్మవారికి వస్త్రాలు సమర్పించారు. యాటలను బలిచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. ప్రతి ఏటా ఆనవాయితీగా పండుగ నిర్వహిస్తామని ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు గణేశ్ తెలిపారు. ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు పోచయ్య, ఉపాధ్యక్షుడు సాయాగౌడ్, కార్యదర్శి సిద్ధు, కోశాధికారి శివకుమార్, నాయకులు మహేందర్‌గౌడ్, సాయిబాబాగౌడ్, బషీర్, జయరాములు, జయాగౌడ్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

లింగంపేట, జూన్ 30: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను పరిశీలించారు. పెండింగ్ చలాన్లు చెల్లించకుంటే వాహనాలను సీజ్ చేస్తామని వాహనదారులను హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టును తప్పకుండా ధరించాలన్నారు. హెల్మెట్ ధరించని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.

పల్లె ప్రకృతి వనంపై పట్టింపేదీ?

- అధికారుల నిర్లక్ష్యం.. గ్రామస్తులకు శాపం
- ఆహ్లాదకర వాతావరణం కరువు
- బాగుచేయాలని ప్రజల విన్నపం

వదల్‌పర్తిలోని పల్లెప్రకృతి వనం

నాగిరెడ్డిపేట, జూన్ 30: ఆరుగాలం కష్టపడే రైతులు, శ్రమజీవులు, పల్లెల్లోని ప్రజలకు పచ్చని బయళ్లు, స్వచ్ఛమైన గాలి అందించడంతోపాటు వారు ఆరోగ్యంగా ఉండేందుకు కేసీఆర్ హయాంలో ప్రభుత్వం గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. కానీ నేడు పట్టింపు లేకపోవడంతో అవి నిర్లక్ష్యానికి గురై ఆనవాళ్లు కోల్పోతున్నాయి. మండలంలోని వదల్‌పర్తిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ఆనుకొని పల్లె ప్రకృతి వనం ఏర్పాటుచేశారు. ఏపుగా పెరిగిన చెట్లు, పచ్చని గడ్డి, పూల మొక్కలు, మనుషులు నడిచేందుకు చెట్ల మధ్య దారులు, సేద తీరేందుకు సిమెంట్ బల్లాలు ఏర్పాటుచేశారు. కాని నేడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మొక్కలు, గడ్డి ఎండిపోయాయి. అక్కడ ప్రస్తుతం ఒక్క మొక్క కూడా కనిపించడం లేదు. చెట్ల నుంచి రాలిన చెత్తను సైతం తొలగించడం లేదు. పట్టించుకునే వారే లేకపోవడంతో వనం చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప కంచె సగం వరకు తెగిపోయింది. అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాన్ని పర్యవేక్షించాలని, గ్రామస్తులు ఉపయోగించుకోవడానికి వీలుగా మార్చాలని పలువురు కోరుతున్నారు.

ప్రకృతి వనంలో పేరుకుపోయిన చెత్త, కనిపించని చెట్లు, ప్రకృతి వనంలో మొక్కల పరిస్థితి ఇలా..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట్, జూన్ 30: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట్ ఏఎస్సై గంగారెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని ప్రధాన చౌరస్తాలో సైబర్ నేరాలపై ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని తెలిపారు. అనవసరమైన లింక్‌లను క్లిక్ చేయొద్దని, బ్యాంక్, ఆధార్, పాన్ వివరాలను ఎవరికీ తెలుపవద్దన్నారు. ఇటీవల మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలు పెరిగాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇంటర్‌నెట్‌ను పరిమితికి మించి వాడొద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రమేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై గంగారెడ్డి

సైబర్ మోసాలతో జాగ్రత్త..

బీబీపేట్, జూన్ 30: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీబీపేట్ ఎస్సై ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతున్నదని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డులను అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చిందని, ప్రాసెసింగ్ ఫీజు కోసం డబ్బులు పంపాలని చెబితే నమ్మొద్దని పేర్కొన్నారు. అనవసర యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దని తెలిపారు. అపరిచితుల ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కామారెడ్డి, జూన్ 30: యాదవ సంఘం ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో కామారెడ్డిలోని శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఎస్సెస్సీలో 9జీపీఏ, ఇంటర్‌లో 900పైన మార్కులు సాధించిన 50 మంది విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ రాహుల్‌యాదవ్, యాదవ సంఘం ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సాయన్న, కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ యాదవ్, భూమేశ్ యాదవ్, క్రిష్ణ యాదవ్, కిష్టయ్య యాదవ్, శివరాజ్, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందుకున్న యాదవ విద్యార్థులు

ఉద్యోగి నిజాయితీతో విధులు నిర్వహించాలి

ఎల్లారెడ్డి, జూన్ 30: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నిజాయితీతో విధులను నిర్వహించాలని ట్రాన్స్‌కో డీఈఈ గణేశ్ అన్నారు. ఎల్లారెడ్డి విద్యుత్‌శాఖలో సీనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేస్తున్న దేవుని సాయిలు రిటైర్‌మెంట్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలుకు పూలమాల వేసి మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీ సుదర్శన్, ఫోర్‌మన్ గంగాధర్, లైన్‌మెన్ లక్ష్మీనారాయణ, కాశీరాం, నూర్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నాయకులు

నాగిరెడ్డిపేట/ నస్రుల్లాబాద్, జూన్ 30: శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని స్థానిక భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నియోజకవర్గ నాయకుడు బత్తిని దేవేందర్ ఆధ్వర్యంలో జప్తిజాన్కంపల్లి గేట్ వద్ద ఆదివారం మొక్కలు నాటారు. పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు మొక్కలను నాటినట్లు వారు తెలిపారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు హన్మాండ్లు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంశెట్‌పల్లిలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

నస్రుల్లాబాద్ మండలంలోని కంశెట్‌పల్లి, నస్రుల్లాబాద్, దుర్కి తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు 'ఏక్ పేడ్ మా కా నామ్ పర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ బాన్సువాడ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, ఓబీసీ జిల్లా నాయకుడు వడ్ల సతీశ్, ప్రధాన కార్యదర్శి మేకల రాములు, నాయకులు సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

అ'పూర్వ' సమ్మేళనం

కామారెడ్డి, జూన్ 30: పదేండ్లు లేదా ఇరవై ఏండ్ల కిందనో చదువుకున్న మిత్రులందరూ కలిసి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించుకోవడం తరచూ చూస్తుంటాం. కానీ తాము ఉన్నత స్థానంలో ఉండడానికి కారణమైన వైద్యుల వద్ద 1982 నుంచి 2024మధ్య కాలంలో శిక్షణ పొందిన సిబ్బంది అందరూ కామారెడ్డిలో ఆదివారం కలుసుకున్నారు. వారి ఆత్మీయ పలుకరింపునకు కామారెడ్డి వేదికైంది. సమ్మేళనంలో భాగంగా కామారెడ్డి జిల్లాలోని రాజంపేట్ మల్టీ స్పెషాలిటీ దవాఖాన, ఎల్లారెడ్డి సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలను స్థాపించిన తండ్రీకొడుకులు ఇట్టెం సిద్ధిరాములు, రవీంద్రమోహన్‌ను వైద్యులు గజమాలతో ఘనంగా సత్కరించారు. సుమారు 120మంది ఆత్మీయంగా పలుకరించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నడిపి సిద్ధిరాములు, చిన్న సిద్ధిరాములు, కిరణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, నవీన్, ఆర్ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ, జూన్ 30: దోమకొండలోని శ్రీ సరస్వతీ విద్యాలయంలో 2002-2003 పదో తరగతి పూర్తి చేసిన వారందరూ 21ఏండ్ల అనంతరం ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. దోమకొండలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. చాలా ఏండ్ల అనంతరం ఒకరికొకరు కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు సిద్ధిరాములు, వీరయ్య, ఎల్లం, మహేశ్, విశ్వానాథం, గణేశ్, మహదేవ్, రాజేశ్, నాగరాజ్, జి.భూషణం, మధుసూదన్‌కు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అరవింద్, భాస్కర్, రాజు, సంతోష్, మల్లికార్జున్, కె.భాస్కర్, హరిప్రసాద్, సంజయ్, మెహర్‌చంద్, లక్ష్మణ్, కె. శ్రీకాంత్, రెహ్మాన్, రాజేందర్, ఎస్.భాస్కర్, నరేశ్, ఎస్. లక్ష్మణ్, భానుచందర్, ఎం.శ్రీకాంత్, స్వాతి, గోదావరి, నవ్య, శ్వేత, గంగామణి, స్వప్న, అపర్ణ, అరుణ, కె.స్వప్న, జి.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో 2002-2003 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

పోచారం ప్రధాన కాలువపై బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు

నాగిరెడ్డిపేట, జూన్ 30: మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామ శివారులో పోచారం ప్రధాన కాలువపై చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. పనులను తనిఖీ చేసిన అనంతరం స్లాబ్ కోసం వేసిన స్టీల్ కొలతలు చూశారు. పనులు నిబంధనల ప్రకారం నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.50లక్షల60 వేల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం స్లాబ్ పనులు చేపడ్తున్నట్లు తెలిపారు. మంగళవారం వంతెనకు స్లాబ్ వేస్తామన్నారు. వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

జప్తిజాన్కంపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

నాగిరెడ్డిపేట, జూన్ 30: మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య విబిరం ఏర్పాటు చేసినట్లు రెడ్ క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు దేశబోయిన సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుడు విక్రమ్ 110 మంది రోగులకు పరీక్షలు చేశారు. ఈసీజీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంజీవరెడ్డి, డివిజన్ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌జోషి, వైద్యసిబ్బంది సందీప్, ప్రమోద్, లలిత, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన..

రామారెడ్డి, జూన్ 30: మండలంలోని మద్దికుంట గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 450 మందిని వైద్యులు పరీక్షించారు. అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం వానకాలం ప్రారంభంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అరవింద్‌గౌడ్, నవీన్‌కుమార్, ప్రవీణ్, కృపతోపాటు 15 మంది డాక్టర్లు పాల్గొన్నారు.

నేడు రాజ్‌భవన్ ముట్టడి

ఖలీల్‌వాడి, జూన్ 30 : 'నీట్' పేపర్ లీకేజీకి కారణమైన ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నేడు (సోమవారం) రాజ్‌భవన్ ముట్టడి నిర్వహించనున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో సమావేశం నిర్వహించారు. పీడీఎస్‌యూ ప్రధానకార్యదర్శి కర్క గణేష్, అనిల్ మాట్లాడుతూ.. రాజ్‌భవన్ ముట్టడికి విద్యార్థులు, మేధావి వర్గం వారు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు విఘ్నేశ్, అషూర్ పాల్గొన్నారు.

7న 'చలో ఈదుమూడి'

ఖలీల్‌వాడి, జూన్ 30 : ప్రకాశం జిల్లా ఈదుమూడి వద్ద జూలై 7వ తేదీన నిర్వహించే మాదిగల జనజాతర సభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపకుడు బీఎస్ రమేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఇందుకు 'చలో ఈదుమూడి' కరపత్రాలను ఆయన ఆదివారం ఆవిష్కరించారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి

రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి

సమావేశాల్లో అభిప్రాయాలను వ్యక్తం చేసిన రైతులు

రామారెడ్డి, జూన్ 30: రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి అన్నారు. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రైతులతో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 'రైతు భరోసా'పై అభిప్రాయాలను సేకరించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. రైతును రాజును చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. ఆయన రైతుల కోసం రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని చెప్పారు. అదే తరహాలతో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రైతు సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సదాశివారెడ్డి, క్లస్టర్ అధికారి నగేశ్, విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పది ఎకరాల్లోపు అన్నదాతలకు అందజేయాలి..

గాంధారి/ భిక్కనూరు/ దోమకొండ, జూన్ 30: పది ఎకరాల వరకు ఉన్న అన్నదాతలకు మాత్రమే రైతు భరోసా పథకం డబ్బులు అందజేయాలని పలువురు రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. గాంధారి సింగిల్ విండో కార్యాలయంలో రైతు భరోసా పథకంపై రైతులు, పాలక వర్గ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఆడిట్ అధికారి రామ్మోహన్.. రైతులు, పాలక వర్గ సభ్యుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాలు ఉన్నా.. పది ఎకరాల్లోపు రైతులకు మాత్రమే పథకాన్ని వర్తింపజేయాలని పలువురు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఏవో నరేశ్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు మనోహర్‌రావు, ఎంపీటీసీ తూర్పు రాజు, విండో కార్యదర్శి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్, డైరెక్టర్లు ముకుంద్‌రావు, దొల్లు సాయిలు, గణపతి రావు, బండారి పరమేశ్, సంగని బాబా, రైతులు పాల్గొన్నారు.

భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ బాలగోని రాజాగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ మాట్లాడుతూ.. పది ఎకరాల్లోపు భూమి ఉన్న వారందరికీ రైతు భరోసా ఇవ్వాలని అన్నారు. వానకాలం పంటలు ప్రారంభమైనందున వెంటనే రైతు భరోసా నిధులను మంజూరు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్లు, ఎంపీటీసీ సాయాగౌడ్, సీఈవో మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పది ఎకరాల్లోపు రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని రైతులు కోరారు. దోమకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసాపై అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వివరించారు. సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పన్యాల నాగరాజురెడ్డి, ఏవో పవన్‌కుమార్, సహకార సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వర్షం

డోంగ్లీ, జూన్ 30: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. మండలంలోని డోంగ్లీ, మారేపల్లి, మల్లాపూర్, మొఘా తదితర గ్రామాల్లో సోయా, కంది, పత్తి విత్తనాలు అలకడం పూర్తయ్యింది. లింబూర్, టాక్లీ, పెద్ద టాక్లీ, సిర్‌పూర్ గ్రామాల్లో విత్తనాలు ఇంకా విత్తడం పూర్తి కాలేదు. వర్షం కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. కానీ ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షం మేలు చేస్తుందని వారు హర్షం వ్యక్తం చేశారు.

పెద్ద టాక్లీలో కురుస్తున్న వర్షం